# బండి.. భాగ్యలక్ష్మి ఆలయంలో ప్రమాణం చేస్తావా..?

- తడి బట్టలతో ఇద్దరం వెళ్దాం.. వచ్చే దమ్ముందా..?
- డబ్బులు, మద్యం పంచిందే నువ్వు
- ఎన్నికల నిబంధనలను తుంగలో తొక్కింది నిజం కాదా..?
- బండి సంజయ్‌కు మంత్రి గంగుల కమలాకర్ సవాల్



విలేకరుల సమావేశంలో సీసీ పుటేజీలు చూపెడుతున్న మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్, నవంబర్ 29 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

'బండి సంజయ్.. నీవు నీతి, ధర్మం పాటించే వ్యక్తివే అయితే ఈ ఎన్నికల్లో మందు, డబ్బులు పంచలేదని నీవు నమ్మే భాగ్యలక్ష్మి దేవాలయంలో ప్రమాణం చేస్తావా..? ఇద్దరం తడి బట్టలతో ఇద్దరం వెళ్దాం.. వచ్చే దమ్మున్నదా..?' అంటూ సంజయ్‌కు కరీంనగర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి గంగుల కమలాకర్ సవాల్ విసిరారు. కరీంనగర్ ఎన్నికల్లో ఓటమి తప్పదని తెలుసుకొని సంజయ్ అసహనానికి లోనవుతున్నారని, ఎలాగైనా గెలిచేందుకు అడ్డదారులు తొక్కుతున్నారని విమర్శించారు. మంగళవారం రాత్రి కొత్తపల్లి మున్సిపల్ పరిధిలో బండి సంజయ్ డబ్బులు పంచడానికి వెళ్లిన సీసీ పుటేజీలను బుధవారం కరీంనగర్‌లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి బయటపెట్టారు. బండి సంజయ్ తీరుపై ధ్వజమెత్తారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం మంగళవారం సాయంత్రం ఐదు గంటలకే ప్రచారం ముగిసిందని, అంతటా 144 సెక్షన్ అమల్లో ఉన్నదని వివరించారు. అయినా సంజయ్ ఈ నిబంధనలను కాదని, కొంత మందిని వేసుకొని రెండు కార్లలో మంగళవారం రాత్రి తొమ్మిది గంటలకు కొత్తపల్లి మున్సిపల్ పరిధిలోని మడిగిలవాడకు వెళ్లారని తెలిపారు. మూడు సంచుల నిండా డబ్బులు తీసుకెళ్లి పంచారని ఆరోపించారు. ఈ విషయం తెలుసుకొని బీఆర్‌ఎస్ నాయకులు ప్రశ్నిస్తే.. వారిపైనే దాడి చేయడంతోపాటు బీఆర్‌ఎస్ వారే డబ్బులు పంచుతున్నట్లుగా సీన్ సృష్టించే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. తమ వాళ్లే డబ్బులు పంచినట్లు ఆయనకు సమాచారం వస్తే.. ఎన్నికల కమిషన్‌కు లేదా పోలీసులకు ఎందుకు ముందుగా ఫిర్యాదు చేయలేదని ప్రశ్నించారు. వాస్తవాలను కప్పిపుచ్చేందుకే సంజయ్, ఆయన అనుచరులు ఈ కుట్రకు పాల్పడ్డారని ఆగ్రహించారు. సంజయ్ రాత్రి తొమ్మిది గంటల సమయంలో రెండు వాహనాల్లో మనుషులను, డబ్బులను తీసుకెళ్లారంటూ సీసీ పుటేజ్‌ను విలేకరులకు చూపించారు. ఇంతకన్నా సాక్ష్యం ఇంకా ఏమి కావాలని ప్రశ్నించారు. అడ్డదారుల్లో వెళ్లిందే గాక, ఇష్టానుసారం బీఆర్‌ఎస్ నాయకులను బూతులు తిట్టారని, ఎమ్మెల్యేగా గెలువక ముందే ఇంత గుండాయిజమా..? అని మండిపడ్డారు. ప్రజలంతా ఒకసారి ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు.

### బండి ఓటమి ఖాయం

బండి సంజయ్‌ను ఓడించేందుకు ప్రజలు ఈ సారి కూడా సిద్ధమయ్యారని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ మెజార్టీ సాధించి.. కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని స్పష్టం చేశారు. కరీంనగర్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా తనను అఖండ మెజార్టీతో గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. నాలుగున్నరేండ్లుగా ప్రజలకు సంజయ్ అందుబాటులో లేరని, అలాగే ఎంపీగా కరీంనగర్ నియోజకవర్గ అభివృద్ధికి ఆయన చేసిదేమీ ఏమీలేదని విమర్శించారు.

### ఓటడిగే హక్కు లేదు

ఎంత సేపూ విద్వేషాలు రెచ్చగొట్టడం తప్ప సంజయ్ ఏనాడూ అభివృద్ధిపై దృష్టిసారించలేదని మంత్రి మండిపడ్డారు. కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి దేవస్థానం, అలాగే ఇస్కాన్ టెంపుల్ నిర్మాణంలోనూ.. సంజయ్‌ది గానీ, కేంద్రానిది గానీ భాగస్వామ్యం ఏమీ లేదని స్పష్టం చేశారు. ₹850 కోట్లతో చేపట్టే మానేరు రివర్‌ఫ్రంట్ విషయంలోనూ ఒక్క పైసా కేంద్రం నుంచి ఇప్పించడం లేదన్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే బండి సంజయ్‌కు కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటు అడిగే హక్కులేదన్నారు. కరీంనగర్‌కు న్యాయ బద్ధంగా రావాల్సిన నవోదయ పాఠశాలలు, ట్రిపుల్‌ఐటీ తేవడంలో విఫలమయ్యారని, అలాగే, ఒక్క మెడికల్ కళాశాల ఇప్పించలేక పోయారని విమర్శించారు. ఇవేకాదు, ఏనాడూ నగర ప్రజలకు ఆయన అందుబాటులో లేరని, ఎన్నికలు వచ్చినప్పుడే వచ్చి మాయ మాటలు చెప్పడం.. గెలుపు కోసం ఏదో ఒక సంఘటన క్రియేట్‌చేసి సెంటిమెంట్‌తో ఓట్లు వేయించుకోవాలనుకోవడం, తద్వారా లబ్ధిపొందాలని సంజయ్ ప్రయత్నిస్తున్నారని విమర్శించారు.

### ఆలోచించి ఓటువేయాలి

నగర భవిష్యత్ ప్రజల చేతుల్లో ఉన్నదని, అందుకే ఆలోచించి ఓటువేయాని మంత్రి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ నియోజకవర్గ అభివృద్ధి నిర్విరామంగా కొనసాగాలన్నా.. కండ్ల ముందే నడుస్తున్న మానేరు రివర్‌ఫ్రంట్ పనులు పూర్తికావాలన్నా.. నగరం ప్రశాంతంగా ఉండాలన్నా.. ఇంకా అనేక ఇతర అభివృద్ధి పనులు పూర్తికావాలన్నా.. కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. ఓటు వజ్రాయుధం అని, దానిని వినియోగించే విధానాన్ని బట్టి ఆ నియోజకవర్గ భవిష్యత్ ఉంటుందన్నారు. రహదారులను బాగుచేసుకున్నామని, ఇంకా కొన్ని శివారు ప్రాంతాల్లో పూర్తిచేయాల్సి ఉందన్నారు. 24 గంటల పాటు మంచినీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటున్న విషయం ప్రజలకు తెలుసని పేర్కొన్నారు. కౌన్సిలర్‌గా, కార్పొరేటర్‌గా, ఎమ్మెల్యేగా తనకు అవకాశం ఇచ్చిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈసారి తనను దీవించి, నగరంలో నిరంతర అభివృద్ధిని చేసే అవకాశం కల్పించాలని కోరారు. నియోజకవర్గంతోపాటు కరీంనగర్‌ను రాష్ట్రంలో రెండో నగరంగా తీర్చిదిద్దే అవకాశం కల్పించాలని కోరారు. సమావేశంలో నగరమేయర్ సునీల్ రావు, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రాజు, బీఆర్‌ఎస్ నాయకులు జమీలుద్దీన్, హరిశంకర్ పాల్గొన్నారు.

# ఒక్క అవకాశమివ్వండి

- అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తా
- రూ.వెయ్యి కోట్లతో హుజూరాబాద్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా
- విలేకరుల సమావేశంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి



మాట్లాడుతున్న పాడి కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్, నవంబర్ 29: ఎన్నికల్లో ఒకే ఒక్క అవకాశమివ్వండి... అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తానని హుజూరాబాద్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, గత నాయకులు తమ స్వలాభపేక్షకోసం పాటుపడ్డారని, తాను అలాంటి నాయకుడిని కాదన్నారు. తనకంటూ ఒక విజన్ ఉందని, ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఓటు వేసి నియోజకవర్గ అభివృద్ధికి బాసటగా నిలవాలని విన్నవించారు. హుజూరాబాద్ ప్రజల చిరకాల వాంఛ అయినా మినీ కలెక్టరేట్, అలాగే పట్టణం చుట్టూ ఔటర్ రింగ్ రోడ్డు, కార్పొరేట్ స్థాయిలో బాలికల హైస్కూల్ నిర్మాణం, పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టమ్, ఫుట్‌పాత్‌లు నిర్మిస్తానని హామీ ఇచ్చారు. వీటితో పాటు మోడల్ చెరువును టూరిజం స్పాట్‌గా మార్చుతానని, డిపో క్రాస్ నుంచి ఇప్పల్ నర్సింగాపూర్ వరకు బీటీ రోడ్, డిపో క్రాస్ నుంచి పరకాల క్రాస్ రోడ్ వరకు, హుజూరాబాద్ మార్కెట్ నుంచి తుమ్మనపల్లి వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తానని తెలిపారు. హుజూరాబాద్ బస్టాండ్‌ను రీడిజైన్ చేసి అద్భుతంగా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు. జమ్మికుంట పట్టణాన్ని బిజినెస్ కేంద్రంగా డిక్లరేషన్ చేస్తామని, నాయిని చెరువును టూరిజం హబ్ మారుస్తామని, 100 పడకల దవాఖాన, అండర్ గ్రౌండ్ బ్రిడ్జి, స్పోర్ట్స్ స్టేడియం (మినీ స్టేడియం) నిర్మిస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. వావిలాల గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేస్తామని, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, అద్భుతమైన పోలీస్ స్టేషన్ నిర్మిస్తామని, అంబేద్కర్, హౌసింగ్ బోర్డు కాలనీల్లో డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని తెలిపారు. కమలాపూర్ గ్రామపంచాయతీని మున్సిపాలిటీగా మార్చడం, చేపల మార్కెట్ ఏర్పాటు, ఉప్పల్, శనిగరాన్ని నూతన మండలాలుగా ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. కమలాపూర్ చెరువును టూరిజం హబ్‌గా మార్పు, మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటు, బస్టాండ్ కాంప్లెక్స్ నిర్మాణం, శనిగరంలోని డీబీఎం-24, పంగిడిపల్లి డీబీఎం-20, 61 పునరుద్ధరణ చేసి కాలువ ఎత్తు పెంచుతానని పేర్కొన్నారు. వీణవంక మండలంలో చల్లూర్ గ్రామాన్ని నూతన మండలంగా ఏర్పాటు చేస్తానని, మినీ ఎల్ఎండీగా కల్వల ప్రాజెక్టును మారుస్తామని, ఎంజేపీ గురుకులానికి నూతన భవనాన్ని నిర్మిస్తామని, పోలీస్ స్టేషన్‌ను అద్భుతంగా తీర్చిదిద్దుతామని, బతుకమ్మ ఘాట్ నిర్మాణం చేస్తానని వెల్లడించారు. ఇల్లందకుంటను టెంపుల్ సిటీ (మినీ యాదాద్రి)గా మారుస్తామని, తహసీల్దార్ కార్యాలయాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుతామని, పోలీస్ స్టేషన్, మండల పరిషత్ కార్యాలయాలకు నూతన భవనాలు నిర్మిస్తామని, టెంపుల్ గెస్ట్ హౌస్, టూరిజం స్పాట్‌గా రిజర్వాయర్ నిర్మాణం చేస్తానని పేర్కొన్నారు. ఇవేకాకుండా నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో మిగిలిన సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ఇతర అభివృద్ధి పనులు పూర్తి చేస్తానని తెలిపారు. అలాగే అన్ని సంఘాల కమ్యూనిటీ భవనాలు, దేవాలయాలు, చర్చిలను అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.

## సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన సీపీ

రాంనగర్, నవంబర్ 29:ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ముందస్తు భద్రత చర్యల్లో భాగంగా బుధవారం కరీంనగర్ కమిషనరేట్‌లోని పలు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి పరిశీలించారు. ఇందులో భాగంగా మానకొండూర్‌లోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను స్వయంగా పరిశీలించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద స్థానిక పోలీసులతో పాటు కేంద్ర సాయుధ బలగాలను విధుల్లో ఉంచామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఉన్న సిబ్బందికి నిర్వహించాల్సిన విధుల పట్ల పలు సూచనలు చేశారు. పోలింగ్ రోజున ఏదైనా శాంతి భద్రతల సమస్యలు తలెత్తితే వెంటనే సంబంధిత పోలీసు అధికారులకు తెలియజేయాలన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా సహకరించి విధులు నిర్వర్తించాలన్నారు.

# ప్రజలే నా బలం.. బలగం



బూరుగుపల్లిలో బీఆర్‌ఎస్ జెండాను ఎగురవేస్తున్న చొప్పదండి బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రవిశంకర్

- చివరి శ్వాస వరకు ప్రజా సేవ చేస్తా
- చావునోట్ల తలపెట్టి తెలంగాణను సాధించిన నాయకుడు కేసీఆర్
- చొప్పదండి బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రవిశంకర్

గంగాధర, నవంబర్ 29: 'ప్రజలే నా బలం.. బలగం. చొప్పదండి నియోజకవర్గ ప్రజలు ఓటేసి గెలిపిస్తే చివరి శ్వాస వరకు ప్రజా సేవ చేస్తా. చావు నోట్లో తలపెట్టి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన సీఎం కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహిస్తారు' అని చొప్పదండి బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రవిశంకర్ పేర్కొన్నారు. బుధవారం దీక్షా దివస్ సందర్భంగా మండలంలోని బూరుగుపల్లిలో బీఆర్‌ఎస్ జెండాను ఎమ్మెల్యే ఎగురవేశారు. అనంతరం మధురానగర్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రజలంతా కేసీఆర్ వెంటే ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. స్థానిక బిడ్డనైన తాను నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. స్థానికేతరులను గెలిపిస్తే అభివృద్ధి కుంటుపడుతుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలకు వారంటీ లేదని, 60 ఏండ్లు రాష్ట్రాన్ని పాలించిన కాంగ్రెస్ ప్రజలకు చేసిందేమీలేదన్నారు. తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ఎన్నికల సందర్భంగా బీఆర్‌ఎస్ ప్రకటించిన మ్యానిఫెస్టోను తప్పకుండా అమలు చేసి తీరుతామన్నారు. స్థానికంగా ఉంటూ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన తనను మళ్లీ గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో గంగాధర, కురిక్యాల సింగిల్ విండో చైర్మన్లు దూలం బాలగౌడ్, వెలిచాల తిర్మల్‌రావు, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మేచినేని నవీన్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాగి మహిపాల్‌రావు, సర్పంచులు వేముల అంజిలావణ్య, వేముల దామోదర్, నాయకులు అట్ల శేఖర్‌రెడ్డి, దూలం శంకర్ గౌడ్, తోట నాంపెల్లి, గడ్డం స్వామి, వాసాల గంగాధర్, మడ్లపెల్లి రమేశ్, నల్ల నరోత్తంరెడ్డి, తూము తిరుపతి పాల్గొన్నారు.

